# సైన్యం సాధించింది.. స్వచ్ఛ ఎల్ఓసీ

- సత్యాగ్రహిల మాదిరిగా స్వచ్ఛాగ్రహులు అవుదాం
- మోదీ కల సాకారానికి మమేకమవుదాం
- లఘుచిత్రాల రూపకర్తల్ని అభినందించిన వెంకయ్య
- తెలుగు చిత్రానికి ద్వితీయ బహుమతి

**ఢిల్లీ:** ఉగ్రవాదులకు నిధులిచ్చి, ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న సరిహద్దు దేశానికి దీటైన సమాధానమివ్వడం ద్వారా 'స్వచ్ఛ నియంత్రణ రేఖ (ఎల్ఓసీ)'ను మన సైన్యం సాధించినట్లయిందని కేంద్ర పట్టణాభివృద్ధి, సమాచార-ప్రసారశాఖల మంత్రి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం దిల్లీలో జరిగిన 'స్వచ్ఛ లఘుచిత్రాల పోటీ' పురస్కారాల ప్రదానోత్సవంలో మంత్రి ప్రసంగించారు. 'ప్రధాని నరేంద్రమోదీ అంటే ఏమిటో మీరు ఈ మధ్య చూశారు. మన పొరుగుదేశం ఉగ్రవాదులకు నిధులు, శిక్షణ, సహకారాలను అందిస్తూ వస్తోంది. వారికి మన సైన్యం తగిన సమాధానం ఇచ్చింది. స్వచ్ఛ మన్ (మనసు), స్వచ్ఛ ధన్ (ధనం), స్వచ్ఛ తన్ (తనువు) మాదిరిగానే స్వచ్ఛ సరిహద్దు, స్వచ్ఛ ఎల్ఓసీలూ సాకారమయ్యాయి. భారతదేశాన్ని స్వచ్ఛభారత్‌గా ముందుకు తీసుకుపోయేందుకు ఇప్పుడు మనమంతా కలిసి రావాలి....' అని వెంకయ్య పిలుపునిచ్చారు.

**మోదీ అంటే...:** మోదీ అనే పేరుకు వెంకయ్య తనదైన శైలిలో మరో నిర్వచనం ఇచ్చారు. 'మూడ్ ఆఫ్ డెవలపింగ్ ఇండియా' (అభివృద్ధి చెందుతున్న భారత్ మనస్థితి) సంక్షిప్త రూపమే 'ఎంఓడీఐ' అని పేర్కొన్నారు. మోదీ ఇచ్చిన పిలుపునందుకుని దేశాన్ని పరిశుభ్రం చేయడంలో పాలు పంచుకోవాలనీ, దీనికోసం అందరూ 'స్వచ్ఛాగ్రహులు' కావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మాగాంధీతో కలిసి సత్యాగ్రహంలో పాల్గొన్నవారంతా సత్యాగ్రహులు అయ్యారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిరక్షరాస్యత నుంచే కాకుండా బాహాటంగా చెత్తపడేసే అలవాటు నుంచీ మనదేశం బయటపడాల్సి ఉందన్నారు. మూడు నిమిషాలకు మించని నిడివితో స్వచ్ఛ లఘు చిత్రాల పోటీలో పాల్గొన్నవారి సృజనను వెంకయ్య అభినందించారు. వీటిని విస్తృతంగా ప్రదర్శించేలా చూస్తామన్నారు. చలనచిత్ర రంగ ప్రముఖులైన మధుర్ బండార్కర్, రాధాకృష్ణ జాగర్లమూడి, రమేష్ సిప్పీ వంటి వారూ స్వచ్ఛభారత్‌పై చిత్రాలు నిర్మించనున్నారని ఆయన చెప్పారు. చలనచిత్రాలు శక్తిమంతమైన మాధ్యమంగా నిలుస్తాయన్నారు. సందేశాన్ని చేరవేయడానికి, సృజనకు, ప్రేరణకు ఎంతగానో దోహదపడే చిత్రాలే కొన్నిసార్లు పెను వినాశనానికీ కారణమవుతాయనీ, సరైన సందేశమిస్తే ప్రజల మదిలో నాటుకుంటుందనీ చెప్పారు.

## 'చెంబుకు మూడింది'...చిత్రానికి రూ.5 లక్షలు

మరుగుదొడ్ల ఆవశ్యకతను నొక్కి చెప్పే రీతిలో తెలుగులో రూపొందించిన 'చెంబుకు మూడింది' చిత్రానికిగానూ కె.వి.కె.కుమార్ ద్వితీయ బహుమతి రూపంలో రూ.5 లక్షల నగదు పురస్కారం పొందారు. మహారాష్ట్రకు చెందిన కత్యానన్ శివ్‌పురి చిత్రం 'ముర్గా'కు ప్రథమ బహుమతి (రూ.10లక్షలు) లభించింది. మూడు చిత్రాలకు ద్వితీయ బహుమతులు, ఆరు చిత్రాలకు తృతీయ బహుమతులు దక్కాయి. మహాత్మాగాంధీపై వెలువడిన రచనల్ని ఇ-పుస్తకాలుగా వెంకయ్య విడుదల చేశారు. వీటిని ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వీలుంది.